## క్లుప్తంగా

### కొనసాగుతున్న రిలే దీక్షలు



తాడేపల్లిరూరల్: తమకు రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారానికి 307వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకుడు స్టీవెన్, వై.సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలో షైక్ ఇమాంబి, ఈదులమూడి శరమ్మా, వేము రిబ్కా, దామవరపు సువర్ణకుమారి, డి.నాగేశ్వ రావు కూర్చున్నారు. కార్యక్రమంలో సీ హెచ్ పిచ్చయ్య, గురవయ్య, వై.సుబ్బారావు, టి.దుర్గాభవాని, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

### పీఎస్ వద్ద వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ ముందుగా పెద్ద ఎత్తున పెరిగిన చెత్తను, పిచ్చి చెట్లను పారిశుద్ధ్య కార్మికులు సోమవారం తొలగించారు. పెద్ద ఎత్తున ఇక్కడ గడ్డి పెరగడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయని స్టేషన్‌కు వివిధ పనుల మీద వచ్చే బాధితులు వాపోతున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్ తదితర వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది ఆ ప్రాంతమంతా శుభ్రం చేశారు.

### ఇంటి స్థలం కోసం కదులుతున్న పేదలు



తాడేపల్లిరూరల్: ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా.. పాలకుల మాటలు నీటి మూటలుగా మారాయని, సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న ఆందోళనకు తరలివస్తామని పేదలు చెబుతున్నారు. అర్హులైన వారందరికీ 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం డోలాస్ నగర్, ప్రభు నగర్ ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలు అర్జీలు రాయించి పేదలకు అందజేశారు. ఈ నెల 17వ తేదీన మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు తరలివస్తామని పేదలు తెలిపినట్లు సీపీఎం నాయకులు చెప్పారు. కార్యక్రమంలో నేతలు నీరుడు దుర్గారావు, వి.శాస్త్రి, పాల్గొన్నారు.

### ఉత్తమ పంచాయతీగా దుగ్గిరాల



దుగ్గిరాల: స్వచ్ఛతా హి సేవలో ఉత్తమ గ్రామ పంచాయతీగా దుగ్గిరాలకు అవార్డు లభించింది. సోమవారం గుంటూరులో కలెక్టర్ నుంచి సర్పంచి బి.ఖుషీ బాయి అవార్డు అందుకున్నారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా పోకూరి రూప ఎంపియ్యారు. వారికి ప్రశంసా పత్రం అందించారు.

### మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంటు..



పొన్నూరు: అధికారుల నిర్లక్ష్యంతో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించేందుకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసింది. కొంతకాలానికి మరమ్మతులకు గురికావడంతో ఆర్వో ప్లాంటు మూలకు చేరింది. ఫలితంగా రక్షిత జలం అందడం లేదు. అప్పటి నుంచి హాస్టల్ వార్డెన్ సమస్యను ఉన్నతాధికారులకు చెబుతూనే ఉన్నారు. అయినా ప్లాంటుకు మరమ్మతులు చేయడం లేదు. అధికారులకు మరోసారి సమస్యను తెలియజేస్తామని వార్డెన్ వెంకటేశ్వరమ్మ అన్నారు.

### ఎలుకల నివారణకు చర్యలు

దుగ్గిరాల: రైతులకు పంట నష్టం కలగకుండా సామూహిక ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం మండలం కేంద్రం దుగ్గిరాలలోని రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ పంట నష్టం కలగకుండా ఎలుకల బొరియలలో మట్టి పెట్టి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం బ్రోమోడయోలిన్ ఎలుక మందు పంపిణీ ఉంటుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# అంధకారంలో ఆంధ్రాప్యారిస్

- దాదాపు 7 గంటలపైె బడి విద్యుత్‌కోత
- ఉరుములు, మెరుపులు కారణంగా ఫీడర్లు ధ్వంసం

తెనాలిటౌన్: ఉరుములు, మెరుపులతో కూడిన అధిక వర్షం కారణంగా తెనాలి పట్టణ, పరిసర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడి ఆంధ్రప్యారిస్ తెనాలిలో అంధకారం ఏర్పడింది. దాదాపు 7 గంటల పైబడి విద్యుత్ అంతరాయం ఏర్పడంతో ప్రజలు నానాఇబ్బందులు పడ్డారు. యడ్లలింగయ్య కాలనీ శివారు 33/11 కె.వి. బుర్రిపాలెం, చక్రాయపాలెం పరిధిలోని 33/11కె.వి. విద్యుత్ లైన్లు ట్రిప్ అవడంతో ఈ పరిస్థితి దాపురించింది. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కురిసిన అధిక వర్షం ఉరుములు, మెరుపులు, పిడుగులకు ఫీడర్లు ధ్వంసమయ్యాయి. దాదాపు 50 మంది పైబడి విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపాదికన ఏడు గంటల పాటు శ్రమిస్తేగాని తిరిగి తెనాలిలో కరెంటు పునఃరుద్ధరణ పరిస్థితి కనబడింది. భయంకరమైన ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఫీడర్లు ధ్వంసమవడం వలనే ఈ పరిస్థితి ఏర్పడిందని, తెనాలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. ఒకేసారి రెండు లైన్లు ట్రిప్ అవడం వలన ఇంతటి దారుణమైన పరిస్థితి కలిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్త పడతామని తెలిపారు. ప్రజలు విద్యుత్‌శాఖకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



యడ్లలింగయ్య కాలనీ శివారు ఫీడర్లు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## వైఎస్సార్ సీపీ నేత 'మందపాటి'కి ఘనసత్కారం

తెనాలి: జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మందపాటి శేషగిరిరావు పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా సోమవారం తెనాలిలో ఘనంగా సత్కరించారు. తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసేందుకు శేషగిరిరావు, ఇక్కడి గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. శివకుమార్‌కు ధన్యవాదాలను తెలియజేశారు. నూతన పదవిలో రాణించాలన్న ఆకాంక్షతో శివకుమార్, పార్టీ నాయకులు శేషగిరిరావును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి శేషగిరిరావు నియమాకం ఉపకరిస్తుందన్న ఆశాభావాన్ని నాయకులు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, అనుబంధ విభాగాల అధ్యక్షులు కొర్ర యశోద, కొంగర రాగమంజరి, మైలా విజయ్ నాయకుడు, సిరికృష్ణ, కావేటి నిర్మల, పొట్లూరు అశోక్, కొమ్ము రాయల్, కఠారి హరీష్, గొరికపూడి బాలరాజు, అత్తోట అమృతరాజు, గుంటూరు కృష్ణ, కాకి దేవసహాయం, కొలకలూరు బాబి, కొమ్ము రాజేష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, దూర రత్నబాబు, వల్లభాపురం సుధాకర్, యాతాటి అనిల్ పాల్గొన్నారు.



మందపాటి శేషగిరిరావును సత్కరించిన శివకుమార్

## నందివెలుగు పంచాయతీకి అవార్డు

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు పంచాయతీకి స్వచ్ఛాంధ్ర ఆవాస్ 2025 అవార్డు లభించింది. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. తెనాలి మండలం నందివెలుగు పంచాయతీకి స్వఛ్ఛాంధ్ర 2025 అవార్డును కలెక్టర్ తమీమ్ అన్సారియా సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్‌కు అందజేశారు. గ్రామంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడం వలన ఈ అవార్డు లభించినట్లు డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ తెలిపారు. గ్రామానికి జిల్లాస్థాయి అవార్డు రావడం పట్ల ఎంపీడీవో అత్తోట దీప్తి, ఇతర అధికారులు ప్రజలకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరుస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించడం వలనే ఈ అవార్డు లభించినట్లు చెప్పారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ పవన్‌కుమార్

## క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండండి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎయిమ్స్ జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ విగ్నేష్ పేర్కొన్నారు. కఠెవరం గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం స్క్రీనింగ్ నిర్వహించారు. క్షయ మందులు వాడే వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు వాడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి లోపిస్తుందని, తద్వారా మళ్లీ క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు సంవత్సరాల నుంచి మందులు వాడిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి చికిత్స పొందిన వారికి ప్రతి ఆరు నెలలకు స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి ఝాన్సీ లక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విఘ్నేష్

## ప్రజావసరాలు తీర్చే విధంగా పనిచేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: ప్రజల అవసరాలను తీర్చే విధంగా మున్సిపల్ అధికారులు పనిచేయాలని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 13వ వార్డులో సోమవారం కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడుతో కలిసి పర్యటించారు. 13వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను కౌన్సిలర్ కుర్రా సుజాత వారికి తెలియజేశారు. రక్షిత మంచినీటి పైపులైన్ లీకులు, పారిశుద్ధ్య నిర్వాహణలో లోపాలను చూపించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, పలువురు ఏఈలు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ అప్పలనాయుడు

## హౌసింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

కొల్లిపర: గుడిబండివారిపాలెం గ్రామంలోని హౌసింగ్ కాలనీ లోని మౌలిక వసతుల సమస్యలపై అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, కాలనీ వాసులతో కలసి సోమవారం రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, గ్రీవెన్స్‌లో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఎంపీడీవో విజయలక్ష్మికి అర్జీ అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి కాలనీని సందర్శించి మాట్లాడుతూ తక్షణమే రెండు లక్షలతో గ్రావెల్‌తో రోడ్డులు మరమ్మతులు, వీధిలైట్లు లేనిచోట కొత్తవి, వెలగని చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయటం, గడ్డి మందు, దోమల మందు పిచికారీ వెంటనే చేయమని పంచాయతీ కార్యదర్శి అలక నంద కు ఆదేశించారు. దీంతో కాలనీ వాసులు ఎంపీడీవోకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చుండూరు పద్మ, పి.శ్రీలత, సయ్యద్ రెహానా, కె.దుర్గా, సొంటి శివనాగదుర్గ, ఎం.వెంకటేష్, మాచర్ల తులసిమ్మ, షేక్ సర్తాజ్, కె.వెంకటేశ్వరమ్మ, చందోలు పద్మ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

## బాధితుడిని పరామర్శించిన మంత్రి మనోహర్

తూములూరు (కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామంలో ఇటీవల మోటూరు మధుసూధనరావు ఇంటిలో ఎవరు లేని సమయంలో దుండగులు పడి సుమారు 10 లక్షల విలువ చేసే 96 గ్రాముల ఆభరణాలు దొంగిలించిన సంఘటన ఈనెల 4వ తారీకున సాక్షి పత్రికల్లో పచురితపైన వేర్వేరు చోట్ల చోరుల చేతివాటం వార్త ద్వారా తెలిసిన విషయమే. ఈ సందర్భంగా సోమవారం తెనాలి శాసనసభ్యులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బాధితుడు మధుసూధనరావును పరామర్శించి, ఏవిధంగా దొంగలు ఇంటిలోకి వచ్చారు అన్న విషయాలను పరిశీలించారు. బాధితుడు మాట్లాడుతూ తను ఇన్నాళ్లు కష్టపడి సంపాదించిన సొమ్ము దొంగపాలైయిందని, తన కుమార్తెకు త్వరలో సంబంధాలు చూచి పెళ్లి చేయాలని అనుకుంటున్న సమయంలో ఇలా దొంగతనం జరిగి తీవ్ర నష్టం జరిగిందని వాపోయాడు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధైర్యపడవద్దు అని మీకు న్యాయం జరిగేలా చూస్తాని హామీ ఇచ్చారు. పోలీసులు దొంగను కనిపెట్టం జరిగిందని, ఇతర విషయాలు కోసం దర్యాప్తు చేయటం జరుగుతుందని తెలిపారు.



బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

### మురుగు కాల్వలను నిర్మించండి



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని నిర్మించే విధంగా చూడాలని 3వ వార్డుకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 32వ వార్డులో స్ట్రీట్ లైట్లు బాగు చేయాలని, మున్సిపల్ స్థలంలోని అక్రమణలు తొలగించాలని పలువురు వినతిపత్రం ఇచ్చారు. అన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనువాసులు, కె.శ్రీనివాసరావు, ఏసీపీ వాణి, తదితరులు పాల్గొన్నారు.

### హౌసింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

దుగ్గిరాల: హౌసింగ్ కాలనీలోని దోమలు, వాటర్ ట్యాంకు నిర్మాణం, సినిమా హాలు నుంచి కాలనీ వైపు వంతెన నిర్మాణం చేపట్టాలని సమస్యల పై వినతి పత్రం అందించారు. సోమవారం దుగ్గిరాలలో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా నాయకులు ఈమని అప్పారావు ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అనంతవరం గోశాలకు పశువైద్య శాఖ నోటీసులు

రెండు రోజుల్లో సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశాలు

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరంలో నిర్వహిస్తున్న గోకులం గోశాల ట్రస్ట్‌ను రెండు రోజుల్లో తరలించాలని పశు వైద్యాధికారి శ్రీ పతి రేణుకాదేవి ఆదేశాలు జారీ చేశారు. గోకులంలో 350 గోజాతి పశువులు, సరైన నీడు, దాణా సదుపాయాలు లేక నీరసిస్తున్నాయని, సీఆర్డీయే స్థలంలో అనుమతి లేకుండా వాటి నిర్వహణ చేస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతిలేని గోశాలను రెండు రోజుల్లోగా తరలించాలని నిర్వాహకులకు ఆమె నోటీసులు జారీ చేశారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

గుంటూరు రూరల్: రెడ్డిపాలెంలోని వృద్ధాశ్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కాటూరి విజయ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. అప్పిరెడ్డి ఆయురారోగ్యాలతో నిండునూరేళ్ల జీవించాలని వృద్ధులు ఆశీర్వచనాలు చేశారు. కార్యక్రమంలో మధు ప్రేమజ్యోతిబాబు, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, దారా హేమ ప్రసాద్, పాటిబండ్ల కిరణ్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

### ఆస్పత్రికి గుంతల మార్గం!



పట్టణ చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు రోడ్డు దుస్థితి ఇది. రోడ్డంతా గుంతలమయం. చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం వందల మంది రోగులు ఈ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారు. అత్యవసర విభాగానికి వెళ్లాల్సిన వాహనాలూ ఇదే రోడ్డున వెళ్లాల్సిందే. ఆసుపత్రికి ఉత్తరంవైపున గల రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు వచ్చే భారీవాహనాలు, అందులోనే కొనసాగుతున్న మద్యం డిపోకు సరుకు చేరవేతకు, అక్కణ్నుంచి షాపులకు తీసుకెళ్లే వాహనాలు ఇదే బాటలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి కీలకమైన రహదారిలో అడుగడుగునా గుంతలు సహనాన్ని పరీక్షిస్తుంటాయి. కనీసం ఆసుపత్రి ఎదుట గుంతలైనా పూడ్చకపోవటం ఏమిటని స్థానికుల్నుంచి అసహనం వ్యక్తమవుతోంది. – తెనాలి

## ఊరించి...ఉసూరనిపించి..!

- మాస్టర్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్
- ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌తో పాటు అందరు అసంతృప్తి
- పక్కాగా విధి విధానాలు రూపొందించాలని ఎమ్మెల్సీ సూచన

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్ అవగాహన సదస్సు ఊరించి... ఊసూరుమనిపించి అన్న చందనా సాగింది. 2047లో తెనాలి ఎలా ఉండబోతుందనే విషయాన్ని ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు తెలియజేయకుండా ప్రస్తుతం ఇక్కడ ఉన్న వనరులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చెప్పారు. దీంతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో పాటు పట్టణంలోని వివిధ వర్గాల ప్రముఖులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ సహకారంతో సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్ తయారుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆర్వీ సంస్థ ప్రతినిధులు తెనాలి పట్టణానికి సంబంధించిన వివరాలు, నైసర్గిక స్వరూపం, అందుబాటులో ఉన్న వనరులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేయటం ప్రారంభించారు.

ఇలా జరుగుతుండగా 2047లో తెనాలి పట్టణంలో చేపట్టనున్న ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్డుల వివరాలు, ఇతర నూతన వసతులను తెలియజేయాలని పలువురు కోరారు. సంస్థ ప్రతినిధులు తాము ఏలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేయలేదని చెప్పటంతో అందరు నిరాశ చెందారు. కొద్ది సమయం తర్వాత పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను అర్థాంతరంగా ముగించారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి పట్టణానికి ఘన చరిత్ర ఉందని తెలిపారు. 2006లో తెనాలి ఎలా ఉందో 2019లో కూడా అలానే ఉందన్నారు. ప్రస్తుతం మీరు తెలియజేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా యధావిధిగా ఉందన్నారు. ఎటువంటి కొత్తదనం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందు సంస్థ ప్రతినిధులు ఫీల్డ్‌కు వెళ్ళి పరిశీలించి అక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పట్టణంలోని మురుగంత మూడు ప్రధాన కాల్వల్లో కలపటం వల్ల కలుషితం అవుతున్నాయని, వాటిని వేరుచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మూడు ప్రధాన కాల్వలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్డుల ప్రతిపాదనలు వంకర టింకరగా ఉన్నాయని, వాటిని సరిచేయాలన్నారు. లోపాలు లేకుండా ప్రజల భవిష్యత్ అవసారాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అనంతరం ప్రజాభిప్రాయం సేకరించకుండా అర్థాంతరంగా సమావేశాన్ని ముగించారు. సమావేశంలో మున్సిపల్ ఆర్డీ మధు కుమార్, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జాగరపు రామ అప్పల నాయుడు, ఏసీపీ శివన్నారాయణ, ఆర్వీ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, వేదికపై చైర్‌పర్సన్ రాధిక

## ఘనంగా సంప్రదాయ దుస్తుల పోటీలు

తెనాలి: స్థానిక గీతామందిరంలో శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆడపిల్లలకు సంప్రదాయ దుస్తుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉప్పులూరి శారద, నారాయణ భారతిదేవి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలకు మొత్తం 50 మంది చిన్నారులు హాజరయ్యారు. వీరిలో వివిధ కేటగిరీల్లో 16 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, అయినాల మల్లేశ్వరరావు, కంకిపాడు రమేష్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పి.జ్యోత్స్న, లక్ష్మీమాధవికి మొదటి బహుమతి రూ.1,000 చొప్పున, రెండో బహుమతిగా ఎ.వెన్నెల, కె.హన్సికరెడ్డికి రూ.500 వంతున, జె.దైవజ్ఞ, వి.కోమలశ్రీ, టి.పరమేశ్వరప్రియకు మూడో బహుమతిగా రూ.300 చొప్పున బహూకరించారు. మరో పదిమందికి రూ.100 చొప్పున ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. నేటితరం సంప్రదాయాన్ని మరవకూడదనే భావనతో ఈ పోటీలను నిర్వహించినట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. వీరంశెట్టి రజిని, తల్లం సావిత్రి, కర్నాట జయలక్ష్మి, కటకం అన్నపూర్ణ, నంబూరి వినతి, దేవానంద్, వేమూరి విజయభాస్కర్ పాల్గొన్నారు. కొండపి వసుంధర పర్యవేక్షించారు.



విజేతలతో సాయిమాధవ్ బుర్రా, ఇతర అతిథులు



### ప్రమాదం జరగకముందే మేల్కొండి

పట్టణ రామలింగేశ్వరపేటలోని దొడ్డపనేని ఇందిర ప్రాథమిక పాఠశాల ఆవరణ పైభాగంలో గల హైటెన్షన్ విద్యుత్ వైర్ల చుట్టూ అక్కడ భారీ వృక్షం కొమ్మలు పెరిగి పోయాయి. ఏదిఏమైనా ప్రమాదం జరగకముందే విద్యుత్‌శాఖ సిబ్బంది దీనిపై దృష్టిని సారించి వైర్లను తాకుతుండే కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– తెనాలి

## వైభవంగా కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం



పెదకాకాని: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెదకాకాని మండలంలోని నంబూరు శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా పండుగ పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన శనగల బలరామిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు ప్రతి రోజూ ఒక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజలు జరిపించారు. కనకదుర్గ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని స్వాగతించి కొబ్బరికాయలు, పసుపు,కుంకుమలు సమర్పించారు. తీన్‌మార్ తప్పెట్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు సందడి చేశారు.



## వడ్డెరలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఎన్నికల ముందు కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తురక రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న 179వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తురక రామారావు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల జనాభా కల్గిన వడ్డే, వడ్డీలుగా పిలుస్తూ సంచార జీవనం సాగిస్తూ దేశ వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో, కర్ణాటకలో ఎస్సీ, తమిళనాడులో ఎస్సీ, కేరళలో ఓబీసీ, ఎస్టీలుగా, ఏపీ, తెలంగాణలో మాత్రం ఇప్పటికీ బీసీలుగా ఉన్నారని పేర్కొన్నారు. వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర అధ్యక్షుడు కుంచాల కృష్ణకిషోర్‌మాట్లాడుతూ భవిష్యత్తులో రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా నిరంతరం శాంతియుత ఉద్యమాలు కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిస్తామని స్పష్టం చేశారు.